నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ బుధవారం 9 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL




సమావేశంలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# బీఆర్ఎస్ రజతోత్సవాన్ని సక్సెస్ చేద్దాం..

## వరంగల్ సభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలి

- పల్లె, పల్లెన గులాబీ జెండా ఎగుర వేయాలి
- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ సమావేశం

ఆదిలాబాద్, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ) : ఈ నెల 27వ తేదీన వరంగల్ జిల్లాలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని, నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపు నిచ్చారు. మంగళవారం బోథ్‌లో నిర్వహించిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సభ విజయవంతంలో గ్రామ, మండల స్థాయి నాయకులు బాధ్యత తీసుకుకోవాలని, ఛలో వరంగల్ వాల్ పేయింట్స్ రాయాలని కోరారు. సభకు బయలుదేరే రోజున ఉదయం నియోజకవర్గంలోని ప్రతి పల్లెలో గులాబీ జెండా ఎగురవేసి డప్పులతో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. వారం రోజుల్లో గ్రామాల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసుకుని ప్రణాళికలు తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వరంగల్ సభలో కేసీఆర్ ప్రసంగం విని గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని చెప్పారు.

### హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కేవలం 15 నెలలపాలనలో ప్రజా వ్యతిరేకత మూట గట్టుకుందని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలతోపాటు ఆరు గ్యారెంటీలను పక్కన పెట్టిందన్నారు. రైతు భరోసా లేక రూ.2 లక్షల రుణమాఫీ కాక రైతులు ఆత్యహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. కల్యాణలక్ష్మీ పథకంలో భాగంగా తులం బంగారం ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాట మార్చారని, బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన డబ్బులు వస్తున్నాయన్నారు. ఏ ఎన్నికలు జరిగినా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో మండలాల కన్వీనర్‌లు, నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు


# వాల్ రైటింగ్ ప్రారంభం

- ఛలో వరంగల్‌ను విజయవంతం చేయాలి
- బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్


ఖానాపూర్, ఏప్రిల్ 8 : ఈనెల 27వ తేదీన వరంగల్ జిల్లాలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో రజతోత్సవ సభకు సంబంధించిన వాల్ రైటింగ్‌ను ప్రారంభించారు. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు గంగన్న, గౌరికర్ రాజు, ప్రదీప్, ఖలీల్, సుమన్, రాజన్న పాల్గొన్నారు.




వాల్ రైటింగ్‌ను తిలకిస్తున్న జాన్సన్ నాయక్, నాయకులు




మంగళవారం పెరిగిన ధరతో (రూ.930) ఓ ఎల్పీజీ వినియోగదారునికి వచ్చిన మెసేజ్




# బండ బాదుడు

- ఒక్కో సిలిండర్‌పై రూ.50
- 'ఉజ్వల' కనెక్షన్లకూ వర్తింపు
- సామాన్యులపై అదనపు భారం
- కేంద్రం నిర్ణయంపై జనం మండిపాటు

ఆదిలాబాద్/నిర్మల్, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ) : వంట గ్యాస్ వినియోగదారులపై బండ బాదుడు మొదలైంది. గృహ సిలిండర్‌పై రూ.50 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. పెంచిన ధరలు మంగళవారం నుంచి అమలులోకి వచ్చాయి. దీంతో ఇప్పటి వరకు రూ.875(14.2 కేజీలు)లు ఉన్న సిలిండర్ ధర రూ.50తో కలిపి రూ.925కు చేరుకున్నది. ఇతర పన్నులు రూ.5లతో కలిపి రూ.930కు చేరింది. కాగా.. రూ.503 ధర ఉన్న ఉజ్వల సిలిండర్‌కు కూడా పెంపు వర్తిస్తుందని కేంద్రం ప్రకటించింది. దీంతో నిరుపేదలు వినియోగించే ఉజ్వల సిలిండర్ ధర రూ.553కు చేరుకున్నది. నిరుపేదలపై కనీస కనికరం లేకుండా కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌పై అదనపు భారం మోపడంపై వారు మండిపడుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎల్పీజీ ధరలు పెరిగాయని, ఇతర కారణాలు చూపుతూ ఒక్కో సిలిండర్‌పై రూ.50 వరకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం పండుగ పూట తీసుకున్న నిర్ణయం సామాన్యులకు భారంగా మారింది. తాజాగా పెరిగిన గ్యాస్ ధర భారం కానున్నది.

### నిర్మల్ జిల్లావాసులపై రూ.1.25 కోట్ల భారం

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 2,51,785 ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో ఉజ్వల కనెక్షన్లు 37,249, సాధారణ కనెక్షన్లు 1,39,430, దీపం పథకం కింద పేదలకు ఇచ్చిన కనెక్షన్లు 47,215 ఉన్నాయి. వీటితోపాటు సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కనెక్షన్లు 26,828, ఇతర కనెక్షన్లు 1,063 ఉన్నాయి. అయితే ప్రస్తుతం పెరిగిన ధరతో నిర్మల్ జిల్లావాసులపై ఏకంగా రూ.1.25 కోట్లకు పైగా అదనపు భారం పడుతుంది. ఎల్పీజీతోపాటు ఇంధన ధరలను ప్రతి నెల సమీక్షిస్తామని కేంద్రం ప్రకటించడంతో భవిష్యత్‌లో కూడా ధరలు పెరిగే అవకాశం ఉన్నదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.



నిర్మల్‌లోని ఓ గ్యాస్ ఏజెన్సీ వద్ద సిలిండర్ కోసం బారులు తీరిన దృశ్యం(ఫైల్)

### ఆదిలాబాద్ వాసులపై రూ.1.44 కోట్ల అదనపు భారం

ఆదిలాబాద్ జిల్లాలో 2,88,346 వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో జనరల్ కనెక్షన్లు 2,05, 250, దీపం 46,136, ఉజ్వల పథకం కింద 36,960 కనెక్షన్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఫలితంగా ప్రతి నెల రూ.1.44 కోట్ల అదనపు భారం పడనుంది.

| | కనెక్షన్లు | నెలకు అదనపు భారం |
|---|---|---|
| నిర్మల్ | 2,51,785 | రూ. 1.25 కోట్లు |
| ఆదిలాబాద్ | 2,88,346 | రూ. 1.44 కోట్లు |

### ధరల పెంపుతో భారమే..



*కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం గ్యాస్ ధరలను ఒకేసారి రూ.50 పెంచి పేదలపై భారాన్ని మోపింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం కింద అర్హులందరికీ రూ.500లకే సిలిండర్ ఇస్తామన్నారు. అది ఎవరికి ఇస్తున్నారో దేవుడికే తెలియాలి. మాకు అన్ని అర్హతలు ఉన్నా రూ.500 గ్యాస్ పథకం రాలేదు. గ్యాస్ ఏజెన్సీలు నిర్దేశిత కిలోమీటర్ల వరకు ఉచితంగా గ్యాస్ డెలివరీ చేయాలని నిబంధన ఉన్నప్పటికీ, డెలివరీ బాయ్స్ కూడా రవాణా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇలా ఎవరికి వారు అడ్డంగా దండుకోవడం వల్ల మా లాంటి పేదలపై మోయలేని భారం పడుతున్నది.*

**- అనూష, గృహిణి, ముజ్గి, నిర్మల్ మండలం.**



గ్రామంలో వెలుగుతున్న వీధి దీపాలు

# అంధకారంలో పల్లెలు

- పంచాయతీలకు నిధులు విడుదల చేయని కాంగ్రెస్ సర్కారు
- పండుగ పూట వీధి దీపాలను వెలిగించిన మాజీ సర్పంచ్
- రూ.8 వేలు వెచ్చించి బల్బులు, హోల్డర్ల కొనుగోలు

కుభీర్, ఏప్రిల్ 8 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పల్లెలు అంధకారంలో మగ్గుతున్నాయి. నిధులు విడుదల చేయకపోవడంతో కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయి. చాలా చోట్ల స్తంభాలకు బల్బులు కూడా లేవు. రాత్రయిందంటే చాలా పంచాయతీలు భయంగా కాలం వెళ్లదీస్తున్నాయి. బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. సోమవారం నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని మాలేగాం గ్రామంలో మహాదేవుని జెండా వేడుకలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మాలేగాం తాజా మాజీ సర్పంచ్ విఠాపూర్ మహిపాల్‌రెడ్డి ఉదారతను చాటుకున్నాడు. రూ.8వేలు వెచ్చించి బల్బులు, హోల్డర్లను తెప్పించాడు. జీపీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని, పదేళ్లలో ఈ పరిస్థితి ఎన్నడూ చూడలేదని గ్రామస్తులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టి పోస్తున్నారు.

# మెప్మాలో గోల్‌మాల్

- రూ.82 లక్షలు దుర్వినియోగం
- ఐదుగురిపై కేసు

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 8 : మహిళా సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి స్త్రీనిధి ద్వారా సర్కారు రుణాలు ఇస్తున్నది. ఈ రుణాలను సంఘాల సభ్యులు చెల్లిస్తుండగా.. ఆర్పీలు మాత్రం ప్రభుత్వ ఖాతాలో జమ చేయడం లేదు. ఈ క్రమంలో అనుమానం వచ్చిన మెప్మా పీడీ సుభాష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ముథోల్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ మెప్మా కార్యాలయంలో మంగళవారం అధికారులు, సిబ్బందిని విచారించాడు. పలు డాక్యుమెంట్లను పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాల చెల్లింపులను బ్యాంకులో జమ చేయడంలో ఆర్పీలు అవకతవకలకు పాల్పడినట్లు తేల్చారు. ప్రాథమికంగా రూ.82 లక్షల వరకు దుర్వినియోగం అయినట్లు పోలీసుల విచారణలో తేలింది. విచారణలో భాగంగా పీడీ సుభాష్, స్త్రీనిధి ఆర్ఎం సరితను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధ్యులైన సైరాభాను, కవిత, జ్యోతి, రజిత, విజయలపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అధిక మొత్తంలో దుర్వినియోగం అయినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. కాగా.. ఈ కేసుపై లోతుగా విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

# మద్దతు గ్యారెంటీ చట్టం అమలు చేయాలి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 8 : దేశవ్యాప్తంగా రైతాంగానికి తాము పండించిన పంటలకు మద్దతు గ్యారెంటీ చట్టం అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నంది రామయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలకు నిరసనగా మంగళవారం కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నంది రామయ్య, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ.. మోడీ ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రామ్-లక్ష్మణ్, బక్కన్న, లక్ష్మీ, గంగన్న, మహేందర్, రాజన్న, శంకర్, భీంరావు, గోరిబాయ్, ఫెరోజ్ పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

# పంట కోత ప్రయోగాలతో దిగుబడి అంచనా

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- ఖోడద్‌లో జొన్న పంట కోత పరిశీలన

తలమడుగు, ఏప్రిల్ 8: తలమడుగు మండలంలోని ఖోడద్ గ్రామానికి చెందిన రైతు చిలుకూరి లక్ష్మారెడ్డి చేనులో జొన్న పంట కోతను మంగళవారం కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. కోసిన జొన్న కంకులు ఎన్ని కిలోలు ఉన్నాయో తూకం వేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలతో దిగుబడి అంచనా వేస్తున్నామని తెలిపారు. జిల్లాలో రైతులు ఎక్కువగా జొన్న పంట వేశారని, ఎకరానికి ఎన్ని కిలోలు పంట వస్తుందన్న అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజ్‌మోహన్, సీపీవో వెంకట రమణ, ఎంపీడీవో శేఖర్, ఏవో ప్రమోద్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు, రైతులు ఉన్నారు.



జొన్న కంకులను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

### చేనులో నిల్వ చేశా..



*నేను మూడెకరాల్లో జొన్న సాగు చేశా. బోరు ఇంకిపోవడంతో నీరందక పంట ఎండిపోయే ప్రమాదం ఉండగా.. కజ్జర్ల కాలువ పూడిత తీసి నీరు అందించి పంటను కాపాడుకున్నా. పది రోజుల కిందట కోయగా 60 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో చేనులోనే నిల్వ చేశా. రాత్రి, పగలు పంటకు కాపలా ఉంటున్నా. మబ్బులు పడితే ఎప్పుడు వర్షం వస్తుందో అని భయం వేస్తున్నది. రాత్రి అడవి పందులు వస్తున్నాయి. ప్రైవేటు వ్యాపారులకు అమ్ముదామంటే మద్దతు ధర కంటే రూ.500 తక్కువకు అడుతున్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులు నష్టపోకుండా చూడాలి.*

**- శార్ధ మోహన్, రైతు, కజ్జర్ల, తలమడుగు.**

# జొన్నలు కొనే వారేరీ?

- కేంద్రాలు లేక చేలలోనే నిల్వలు
- పంట ఉత్పత్తుల వద్ద రాత్రీపగలు కాపల
- కారుమబ్బులతో భయపడుతున్న రైతులు
- వర్షం కురిస్తే నష్టపోతామని ఆందోళన

ఆదిలాబాద్, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ) : ప్రకృతి వైపరీత్యాలను అధిగమించి, అహర్నిశలు శ్రమించి సాగు చేసిన పంట ఉత్పత్తులను విక్రయించడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. జొన్న పంట కోతకు రాగా.. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వం మిన్నకుండి పోతున్నది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా గతేడాది 71,300 ఎకరాల్లో సాగవగా.. ఈ ఏడాది 80 వేల ఎకరాలకు చేరింది. తలమడుగు, తాంసి, భీంపూర్, ఆదిలాబాద్ రూరల్, జైనథ్, ఇచ్చోడ, బోథ్, బేల, సిరికొండ మండలాల్లో జొన్నను అధికంగా సాగు చేస్తారు. ఈ యేడాది భూగర్భ జలాలు అడుగంటడంతో రాత్రి, పగలు తేడా లేకుండా శ్రమించారు. ఫలితంగా ఎకరాకి 18 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా కోతలు ప్రారంభం కాగా.. హార్వేస్టర్ల ద్వారా పంటను తీస్తున్నారు. చేతికొచ్చి పది రోజులు దాటినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు ఇండ్ల ఎదుట, చేలు, గ్రామ శివారులోని ఖాళీ ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారు. ఎప్పుడు వర్షం వస్తుందో అని భయపడుతున్నారు. జొన్నల కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.3,371 ఉండగా పంట నిల్వ చేసుకునే స్థలం లేక కొందరు రైతులు ప్రైవేటు వ్యాపారులకు మద్దతు ధర కంటే రూ. 500లకు తక్కువకు విక్రయించి నష్టపోతున్నారు. పక్షం రోజుల కిందట తలమడుగు మండలంలోని కజ్జర్ల రైతులు ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని దరఖాస్తు ఇచ్చారు.



కజ్జర్లలోని ఖాళీ ప్రదేశంలో రైతులు నిల్వచేసిన జొన్నలు

### నష్టపోతున్నాం..



*మా గ్రామంలో 250 ఎకరాల వరకు జొన్న సాగైంది. అందరూ రైతులు పంటను తీసి చేలు, ఖాళీ ప్రదేశాల్లో నిల్వ చేసుకున్నారు. ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందా? అని ఎదురు చూస్తున్నారు. జొన్న కొనుగోళ్లు ప్రారంభించాలని ఎకరానికి 18 నుంచి 20 క్వింటాళ్ల కొనుగోలు చేయాలని కలెక్టర్‌కు ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చినం. పక్షం రోజులు అవుతున్నా కేంద్రాలను ప్రారంభించలేదు. దీంతో రైతులు తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు జొన్నలు అమ్మి నష్టపోతున్నారు. వర్షం వస్తే పంట భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి కొనుగోళ్లు ప్రారంభించాలి.*

**- చింతలపల్లి రామన్న, రైతు, కజ్జర్ల, తలమడుగు.**